క్లుప్తంగా

రామాలయంలో శ్రీలక్ష్మీ సహస్రనామార్చన

పాలకొల్లు సెంట్రల్: స్థానిక బుధవారపు వీధి రామాలయంలో శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం శ్రీ లక్ష్మీ సహస్రనామార్చన పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో సుమారు 50 మంది మహిళలు పాల్గొన్నారు. పూజా కార్యక్రమాలు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు శ్రీకాకొల్లు వెంకన్న, విన్నకోట శ్రీరంగనాయకులు, బదరి, ఉప్పరి పాల్గొన్నారు.

అన్నసమారాధనకు రూ.లక్ష విరాళం

యలమంచిలి: అడవిపాలెం గ్రామంలోని పంచముఖ అంజనేయస్వామి ఆలయం వద్ద ప్రతి మంగళవారం అన్నసమారాధన చేస్తున్నారు. మచిలీపట్నానికి చెందిన పులపర్తి కస్తూరిగాంధీ దంపతులు శుక్రవారం ఆలయానికి వచ్చి స్వామిని దర్శించుకుని ఆలయ విశిష్టత తెలిసి శాశ్వత అన్న సమారాధనకు కమిటీ చైర్మన్ నక్రెడ్డి శ్రీనుకు రూ.లక్ష విరాళం ఇచ్చారు. ఈ డబ్బుపై వచ్చే వడ్డీతో ప్రతి వారం భక్తులకు భోజనాలు పెట్టాలని కోరారు. కార్యక్రమంలో కర్రి నాని, బళ్ల శంకర్, గుమ్ములూరి ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రాములోరి రథోత్సవం

నరసాపురం రూరల్: శ్రీరామ నవమి వేడుకలు ముగింపు సందర్భంగా శుక్రవారం రథోత్సవాలు నిర్వహించారు. స్థానిక పెద్దపల్లవపాలెం, గుంటపల్లవపాలెం గ్రామాలకు చెందిన భక్తులు రాములోరిని రథంలో ఊరేగించారు. గ్రామంలోని ప్రధాన కూడళ్ల గుండా సాగిన ఈ రథోత్సవంలో భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

మార్కెట్ వేలం ఖరారు

నరసాపురం రూరల్: మొగల్తూరు గ్రామ పంచాయతీకి చెందిన కూరగాయలు, చేపల మార్కెట్, వాహన పన్నులు వసూలు చేసేందుకు శుక్రవారం వేలం పాట నిర్వహించారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన వేలం పాటలో గ్రామానికి చెందిన ముక్కు ఓం వెంకట నాగేశ్వరరావు రూ.3.53 లక్షలకు పాటను దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ ఈవోఆర్డీ నవీన్ కిరణ్, పంచాయతీ కార్యదర్శి జయరాజు, గ్రామ సర్పంచ్ పడవల మేరీ, వార్డు సభ్యురాలు పొన్నపల్లి లక్ష్మీ తదితరులున్నారు.

వీరపేరంటాలమ్మ జాతర 3 వరకు పొడిగింపు

ఉండి: ఉండి మండలం వెలివర్రు వీరపేరంటాలమ్మవారి 70వ వార్షిక జాతర మహోత్సవాలు ఏప్రియల్ 3వ తేదీ వరకు పొడిగించినట్లు ఆలయ చైర్మన్ మంతెన రంగరాజు తెలిపారు. మార్చి 31వ తేదీ శుక్రవారంతో ముగియాల్సిన కార్యక్రమాలు అమ్మవారిని దర్శించుకునేందుకు వస్తోన్న భక్తుల రద్దీ ఎక్కువ కావడంతో మరో మూడు రోజులు పొడిగించినట్టు చెప్పారు. ఈనెల 3వ తేదీ సోమవారం ఆలయ ప్రాంగణంలో భారీ అన్నసమారాధన ఏర్పాటు చేస్తున్నట్టు గ్రామ సర్పంచ్ పెన్మెత్స అంజనాదేవి, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు ముదునూరి కొండరాజు, కళ్లేపల్లి సతీష్‌రాజు తెలిపారు.

మావుళ్లమ్మకు బంగారం సమర్పణ

భీమవరం(ప్రకాశం చౌక్): శ్రీమావుళ్లమ్మ అమ్మవారి స్వర్ణాభరణానికి శుక్రవారం జువ్వలపాలెం వాస్తవ్యులు కలిదిండి రాజ్యలక్ష్మీ 8 గ్రాముల బంగారం వారి తండ్రి జంపన కృష్ణమూర్తి రాజు 2 గ్రాముల బంగారం సమర్పించారు. వారికి ఆలయ ధర్మకర్తలు ముత్యాల వెంకట రామారావు, రామాయణం సత్యనారాయణ, ఆలయ సిబ్బంది ఆలయ మర్యాదలతో సత్కరించి అమ్మవారి ప్రసాదాలు అందించారు.

సొసైటీల ద్వారా రైతుకు విశిష్ట సేవలు

కాళ్ల: సహకార సంఘాల ద్వారా రైతులకు విశిష్ట సేవలు అందించేందుకు కృషి చేస్తున్నట్టు కోపల్లె సొసైటీ అధ్యక్షుడు వేగేశన జయరామకృష్ణంరాజు అన్నారు. సొసైటీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మహాజన సభలో ఆయన మాట్లాడారు. సొసైటీ పరిధిలో ఉన్న సుమారు 11 గ్రామాల రైతులకు నాణ్యమైన ఎరువులు, వ్యవసాయ రుణాలు, బంగారంపై తక్కువ వడ్డీకి రుణాలు అందిస్తున్నామని చెప్పారు. సొసైటీలు అందిస్తోన్న సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డైరెక్టర్లు గోళ్ల వెంకట రాంబాబు, ముంజేటి రామకృష్ణ, సీఈఓ జంపన సాయిగీత పాల్గొన్నారు.

డేటా ఎనలిటిక్స్ ద్వారా ఎన్నో ప్రయోజనాలు

సాక్షి, భీమవరం: డేటా ఎనలిటిక్స్ ద్వారా డేటాను సంరక్షించుకోవడంతో భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా డేటాను విశ్లేషించుకోవడం, వ్యాపార సంస్థల భవిష్యత్‌ను ముందస్తుగా అంచనా వేయడం వంటి వాటి ద్వారా డేటా ఎనలిటిక్స్ ప్రయోజనాలను పొందవచ్చునని లండన్‌కు చెందిన లీడ్‌డేటా ఆర్కిటెక్ట్ పెన్మెత్స శిరీష అన్నారు. భీమవరం డీఎన్నార్ కళాశాలలో శుక్రవారం డేటా ఎనలిటిక్స్ అనే అంశంపై ఏర్పాటు చేసిన ఆన్‌లైన్ సదస్సులో ఆమె మాట్లాడారు. ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ అకడమిక్ అఫైర్స్ డీన్ పి.సురేష్‌వర్మ మాట్లాడుతూ డేటా ఎనలిటిక్స్ ఉపయోగాలను వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ బీఎస్ శాంతకుమారి, పాలకవర్గ సభ్యుడు పి.రామకృష్ణంరాజు పాల్గొన్నారు.

మహిళా సాధికారత కోసం కృషి

జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్


పాలకొల్లులో డ్వాక్రా మహిళలకు వైఎస్సార్ ఆసరా చెక్కు అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్

పాలకొల్లు అర్బన్: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళా సాధికారత కోసం కృషి చేస్తున్నారని జిల్లా పరిషత్ చైర్మన్, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ అన్నారు. వైఎస్సార్ ఆసరా వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం పాలకొల్లు పట్టణంలోని బీఆర్ఎంవీ మునిసిపల్ హైస్కూల్ ఆవరణలో జరిగిన ఆసరా సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రజా సంకల్పయాత్రలో అక్కచెల్లెమ్మల కష్టాలను స్వయంగా తెలుసుకుని మహిళలను మహరాణులు చేయడానికి నిరంతరం శ్రమిస్తున్నారన్నారు. బడ్జెట్‌లో అధిక శాతం నిధులు మహిళా సంక్షేమానికి కేటాయించి అమలు చేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని 921 గ్రూపులకు చెందిన 9210 మంది డ్వాక్రా మహిళలకు రూ.8.47కోట్ల చెక్కును డ్వాక్రా మహిళలకు అందజేశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి మహిళలు క్షీరాభిషేకం చేశారు. పట్టణంలోని 31వార్డులకు చెందిన వైసీపీ ఇన్‌చార్జ్‌లు ఎమ్మెల్సీగా విజయం సాధించిన జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్‌ను గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ కమిషన్ మెంబర్ చెల్లెం ఆనందప్రకాష్, సీఆర్పీ ఎం.పద్మావతి, మాజీ ఎమ్మెల్సీ మేకా శేషుబాబు, జెడ్పీటీసీ నడపన గోవిందరాజులనాయుడు, వైఎస్సార్ సీపీ చింతలపూడి నియోజకవర్గ పరిశీలకుడు గుణ్ణం నాగబాబు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి చిలువూరి కుమార దత్తాత్రేయవర్మ, హౌసింగ్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పెదపాటి పెద్దిరాజు, సచివాలయ పట్టణ కన్వీనర్ ఎంఎస్ వాసు, పట్టణ యూత్ అధ్యక్షుడు మానుకొండ శ్రీనుబాబు పాల్గొన్నారు.

యలమంచిలిలో..

యలమంచిలి: రాష్ట్రంలోని ప్రతి మహిళ ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి లక్ష్యమని జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్ అన్నారు. యలమంచిలి సెంటర్‌లోని తమ్మినీడి నరసింహారావు ఎస్టేట్‌లో శుక్రవారం జరిగిన వైఎస్సార్ ఆసరా సంబరాల సభలో ఆయన మాట్లాడుతూ జగనన్నకు మహిళలంతా బాసటగా నిలవాలని ఆయన కోరారు. మూడవ విడతలో యలమంచిలి మండలంలో ఉన్న 1363 గ్రూపులకు రూ.12,78,06,431 డబ్బులు వచ్చినట్లు ఆయన వివరించారు. అలాగే జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్ ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలలో విజయం సాధించినందుకు అభినందిస్తూ డ్వాక్రా మహిళలు ఆయనను శాలువా, గజమాల, జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ రావూరి వెంకటరమణ బుజ్జి, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ, పార్టీ నాయకులు చిలువూరి కుమార దత్తాత్రేయవర్మ, వినుకొండ రవి, సర్పంచ్‌ల చాంబర్ మండల అధ్యక్షులు వల్లభు సాయి వెంకట నరసింహారావు, జేసీఎస్ కన్వీనర్ ఓదూరి భాస్కరరావు, వైస్ ఎంపీపీలు గొల్లపల్లి శ్రీనివాసరావు, కొప్పాడి శ్రీనుబాబు, సొసైటీ చైర్మన్‌లు గుర్రాల వెంకట్రావు, చివటపు నాగేశ్వరరావు, సర్పంచ్‌లు పాలంకి శ్రీనివాసరావు, మేడిది విజయ జ్ఞానమణి ఎంపీటీసీ సభ్యులు దేగల సూర్యప్రభ, ఇసుకపల్లి శ్రీధర్‌వర్మ తదితరులు పాల్గొన్నారు.


యలమంచిలిలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్

ఉపాధి హామీ పనులను వినియోగించుకోవాలి

పోడూరు: ఉపాధి హామీ పథకాన్ని కూలీలంతా సద్వినియోగం చేసుకోవాలని గుమ్మలూరు సర్పంచ్ గొట్టుముక్కల సోనియా రమేష్ పిలుపునిచ్చారు. ఉపాధి హామీ పనుల్లో భాగంగా శుక్రవారం గ్రామంలోని కోమటిచెరువు తవ్వకం పనులను ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు పోతాబత్తుల లక్ష్మీ యశోదకృష్ణ, అంబటి సుధాకర్, వైఎస్సార్‌సీపీ గ్రామకమిటీ అధ్యక్షుడు అల్లూరి తిమ్మరాజు, ఉపసర్పంచ్ అల్లూరి గీత, వార్డుమెంబర్లు కె.వెంకటేశ్వరరావు, వై.నాగమణి, ఏఎంసీ డైరెక్టర్ అల్లూరి విజయలక్ష్మి పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ

నరసాపురం: పట్టణంలోని కృపాకమల్ ఐటీఐ కళాశాలలో కొద్దిరోజులుగా ప్రముఖ ఐటీ కంపెనీ ఐబీఎం, ఒన్ఎంఒన్‌టీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్కిల్స్‌బిల్డ్ అనే అంశంపై గతకొన్ని రోజులుగా సాగుతున్న శిక్షణా కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. జిల్లాలో పలు కళాశాలలు, పాఠశాలల విద్యార్థులు ఇందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐబీఎం స్కిల్డ్‌బిల్డ్ స్టేట్ కన్వీనర్ రాగలపల్లి ఫణీంద్రకుమార్, కృపాకమల్ కళాశాల కరస్పాండెంట్ కె.శ్యామ్యూల్ మాట్లాడుతూ ఐబీఎం స్కిల్డ్‌బిల్డ్ కార్యక్రమంలో భాగంగా ఒన్ఎంఒన్‌టీ ఫౌండేషన్ ద్వారా పలు పాఠశాలలకు, కళాశాలలకు ఉచితంగా రిజిస్ట్రేషన్ చేయిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో టి.జాన్, కందికట్ల సాగర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం


చామకూరిపాలెం గ్రామంలో ఆసరా చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు

చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు

నరసాపురం రూరల్: పేదరికమనే రక్కసిని పారదోలేందుకు జగనన్న ప్రవేశపెట్టిన నవరత్నాల సంక్షేమ పథకాలు ఎంతగానో దోహదపడుతున్నాయని చీఫ్ విప్, ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు అన్నారు. మండలంలోని చామకూరిపాలెంలో శుక్రవారం నిర్వహించిన వైఎస్సార్ ఆసరా మూడో విడత కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. తొలుత పసలదీవి, చామకూరిపాలెం, ఎల్చిచర్ల, తూర్పుతాళ్లు, పెదమైనవానిలంక గ్రామాలకు సంబంధించిన 420 డ్వాక్రా స్వయం సహాయక సంఘాలకు సుమారు రూ.9.45కోట్ల ఆసరా నమూనా చెక్కును అందించారు. గత ప్రభుత్వం రుణాలు మాఫీ చేస్తామని హామీ ఇచ్చి 2014లో అధికారంలోకి వచ్చిన తరువాత ఇచ్చిన హామీ నెరవేర్చలేదన్నారు. కరోనా సమయంలోకూడా ఇచ్చిన హామీలను అమలు చేస్తూ అమ్మ ఒడి, నాడు–నేడు, వైఎస్సార్ సంపూర్ణ ఆహార పథకం, వంటి పథకాలను అమలు చేశామని అన్నారు. దిశ యాప్‌తో భద్రత కల్పించి చర్యలు చేపట్టామన్నారు. తొలుత ఎమ్మెల్యే ప్రసాదరాజుకు డ్వాక్రా మహిళలు ఘనంగా స్వాగతం పలికి ఆయనను సత్కరించారు. అనంతరం మహిళలు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఎంపీపీ మైలాబత్తులత సోనీ, జెడ్పీటీసీ సభ్యుడు బొక్కా రాధాకృష్ణ, దొంగ మురళీకృష్ణ, మాజీ ఆప్కాబ్ చైర్మన్ అంద్రాజు చల్లారావు, ఎంపీడీవో ఎన్వీ శివప్రసాద్‌యాదవ్, ఏపీఎం పిప్పళ్ల పద్మ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమాన్ని ప్రజలకు వివరించాలి


సచివాలయ మండల కన్వీనర్లుకు ప్రచార కిట్లు అందిస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

పెనుగొండ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనో పేదలకు నవరత్నాలు ద్వారా అందించిన సంక్షేమాన్ని ప్రజలకు వివరించాలని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. శుక్రవారం తూర్పుపాలెంలోని కార్యాలయంలో సచివాలయ మండల కన్వీనర్లుకు ప్రచార కిట్లు పంపిణీ చేసారు. గతంలో జన్మభూమి కమిటీలు ప్రతీ పథకంలో అవినీతి చేశాయన్నారు. దీంతో పారదర్శక పాలనకు వలంటీరు వ్యవస్థను తీసుకు వచ్చి పారదర్శకంగా అర్హతే ప్రామాణికంగా పార్టీలకు అతీతంగా సంక్షేమాన్ని సీఎం జగన్ అందించారన్నారు. ఎక్కడా అర్హులకు అన్యాయం జరగకుండా అడగడుడునా సీఎం జగన్ జాగ్రత్తలు తీసుకొన్నారన్నారు. మరింతగా సంక్షేమాన్ని పటిష్టంగా అమలు చేయడానికి సచివాలయాల పరిధిలో గృహ సారథులు నియామకం చేపట్టడంతో పాటు, గ్రామ సచివాలయ కన్వీనర్లు నియామక చేపట్టారన్నారు. వీరికి మండల స్థాయిలో మండల కన్వీనర్లు నియమించారన్నారు. గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, మండల సచివాలయ కన్వీనర్లు సమన్వయంతో ముందకు సాగుతూ సీఎం జగన్ అమలు చేసిన సంక్షేమాన్ని వివరించాలన్నారు. ఇప్పటి వరకూ రాష్ట్రంలో సంక్షేమానికి రూ.2.25లక్షల కోట్లు పేదలకు అందించారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీలు పూతినీడి వెంకటేశ్వరరావు(పెద్ద), కర్రి వెంకట నారాయణ రెడ్డి(వాసు), జెడ్పీటీసీ సభ్యుడు గుంటూరి పెద్దిరాజు, ఆచంట మండల సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారాం, సర్పంచ్ ఎస్ వీర్రాజు, సచివాలయ మండల కన్వీనర్లు సాకా సుబ్రహ్మణ్యం, తడాల నాగ చంద్రశేఖర్, కేఆర్ఎస్ఎస్ నారాయణ రెడ్డి, పైడి ఏసుబాబు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్లు పిల్లి నాగన్న, జక్కంశెట్టి చంటి, పార్టీ నాయకులు పాలసత్తి రామిరెడ్డి, కొవ్వూరి చిన్న, సత్తి విష్ణుకుమార్ రెడ్డి, తాతాజీ, సురేష్ రెడ్డి పాల్గొన్నారు.

సంపూర్ణ పోషణే ధ్యేయం

నరసాపురం రూరల్: తల్లీబిడ్డ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలంటే పోషకాహారం తప్పనిసరి అని నరసాపురం మున్సిపల్ చైర్ పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ అన్నారు. శుక్రవారం నరసాపురం మండల పరిషత్ కార్యాలయ సమావేశమందిరంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహార పక్షోత్సవాలో భాగంగా నిర్వహించిన పోషణ్ పక్వాడా కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుట్టే ప్రతీబిడ్డా సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని, దానిలో భాగంగానే వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం ద్వారా గర్భిణులు, బాలింతలు, ఆరేళ్ల లోపు చిన్నారులకు రోజువారీ మెనూ ప్రకారం మధ్యాహ్నం పౌష్టికాహారం వండి వడ్డిస్తున్నారన్నారు. ముందుగా గర్భిణులకు సీమంతం నిర్వహించారు. సీడీపీవో ఊర్మిళ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హసీనా, కౌన్సిలర్లు సోమరాజు దుర్గా భవాని, మల్లాడి శేషవేణి, పతివాడపద్మ, ద్వారా గంగా భవాని, సిర్రా కాంతమ్మ, అడిదెల విజయ శ్యామల తదితరులు పాల్గొన్నారు.

చిరు ధాన్యాలపై అవగాహన


ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ్ పక్వాడా కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: పోషక విలువలతో కూడిన చిరుధాన్యాన్ని ఆహారంగా తీసుకోవడం మంచిదని గ్రామ సర్పంచ్ కవురు సావిత్రి తెలిపారు. శుక్రవారం కాళీపట్నం పడమర గ్రామంలో పోషణ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా పోషణ పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని పాఠశాలలు అంగన్‌వాడీ కేంద్రాలు సందర్శించి పోషక విలువలు కలిగిన రాగులు, సజ్జలు తదితర వాటిని ఆహారంగా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కవురు సీతామహాలక్ష్మీ, అంగన్‌వాడీ వర్కర్ మేడిద సుజాత, నాయకులు దొంగ నాగముని, కవురు ఆదినారాయణ పాల్గొన్నారు.

నేడు వేంకటేశ్వర స్వామి తీర్థ మహోత్సవం

పెనుమంట్ర: మండలంలోని మార్టేరులో ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వర స్వామివార్ల 65వ వార్షిక కల్యాణమహోత్సవం సందర్భంగా శనివారం తీర్థ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. మార్టేరు తీర్థ మహోత్సవానికి అత్యంత పేరు ప్రఖ్యాతులు ఉండడంతో పరిసర ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు తరలివస్తుంటారు. దీంతో శనివారం ఉదయం నుంచి అర్ధరాత్రి వరకూ భక్తులతో కిటకిటలాడుతుంది. ఈ సందర్భంగా శనివారం రాత్రి బాణసంచా కాల్పులు నిర్వహించనున్నారు. మార్టేరులోని తీర్థ మహోత్సవ బాణసంచా కాల్పుకు ప్రత్యేక ఉంది. ఉదయం ఆలయంలో 8 గంటలకు అన్నమాచార్య భక్తి సంగీత విభావరి, 11 గంటలకు నాద స్వర కచేరీ, 12 గంటలకు వీరాభిమన్యు బుర్ర కథ, 3గంటలకు సినీ మ్యూజికల్ నైట్, మధ్యాహ్నం 3 గంటల నుంచి భారీ అన్నసమారాధన నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా సాయంత్రం 4 గంటల నుంచి ఆభోతులు, కోలాట ప్రదర్శనలతో స్వామివారి రథోత్సవం నిర్వహించనున్నారు. 8.30గంటలకు లడ్డూ ప్రసాదం వేలం, 9గంటలకు కూచిపూడి నృత్య ప్రదర్శన వంటివి నిర్వహించనున్నారు.


మార్టేరు ఏకాంబరేశ్వర స్వామి కామాక్షీ అమ్మవార్ల కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం


శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

భక్తిశ్రద్ధలతో కల్యాణోత్సవాలు

శుక్రవారం ఆబోతు సమాధి చేసిన ఆలయంలో తొలుత ఏకాంబరేశ్వర సమేత కంచికామాక్షీ వారి కల్యాణాన్ని కోనాల హేమ ప్రవీణ్ రెడ్డి, నిఖిత లక్ష్మీ దంపతులతో వేదపండితులు భక్తిశ్రద్ధల తో నిర్వహించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి వేకటేశ్వర స్వామి కల్యాణాన్ని దింటకుర్తి వెంకటేశ్వరరావు, వెంకట పద్మావతి దంపతులతో వేద మంత్రోచ్చారణల మధ్య అత్యంత వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణాలు చేపట్టాలి

పాలకోడేరు: జగనన్న కాలనీల్లో స్థలాలు పొందినవారంతా ఇంటి నిర్మాణాలు చేపట్టాని ఆర్డీఓ దాసి రాజు అన్నారు. పాలకోడేరు గ్రామంలో జగనన్న లే అవుట్‌ను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ లేఅవుట్‌కు వెళ్లే దారిని గ్రామ పంచాయతీ నిధులు రూ.8 లక్షలతో రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకున్నారు.

మహిళల ఉన్నతికి ప్రభుత్వం కృషి

- జీవన ప్రమాణాల మెరుగుదలే లక్ష్యం
- పొట్టేళ్లు, కడక్‌నాథ్ కోళ్లు పెంచుతూ ఉపాధి


కొత్తపేటలో పొట్టేళ్లు పెంచుతున్న బొండాడ లక్ష్మి

పాలకొల్లు అర్బన్: మహిళలు ఆర్థిక సాధికారతకు ప్రభుత్వం కృషి చేస్తుంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా ప్రభుత్వం నుంచి పొందిన లబ్ధిని వృథా ఖర్చులు చేయకుండా చిరు వ్యాపారాల వైపు డ్వాక్రా మహిళలు దృష్టి సారిస్తున్నారు. నవరత్నల పథకాల్లో భాగంగా వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా, జగనన్న తోడు, సున్నా వడ్డీ తదితర పథకాలు మహిళల జీవన ప్రమాణాలు మెరుగుకు ఎంతో దోహద పడుతున్నాయి. ఈ పథకాల ద్వారా పొందిన సొమ్ములతో చిరు వ్యాపారాలు సాగిస్తున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో కూరగాయల వ్యాపారం, చిన్న మొత్తంలో ఫ్యాన్సీ, టీ స్టాల్, నాటు కోళ్ల పెంపకం, కడక్‌నాథ్ కోళ్లు, పొట్టేళ్ల పెంపకం ద్వారా ఆర్థికంగా లబ్ధి పొందుతున్నారు. ప్రభుత్వం ఇటీవల కాలంలో ఉన్నతి పథకం ద్వారా ఎస్సీ లబ్ధిదారులకు పొట్టేళ్లు అందజేసింది. రూ.42వేలు బ్యాంక్ రుణం అందజేసింది. ఈ డబ్బుతో పొట్టేళ్లు కొనుగోలు చేసుకుని ఇంటి పెరట్లో పెంచుకుంటున్నారు. ఇవి ఏడాది కాలం వీటిని పెంచి అనంతరం విక్రయిస్తే అధిక లాభాలు పొందవచ్చు. అలాగే వీటికి ప్రభుత్వం ఇన్సూరెన్స్ సౌకర్యం కూడా కల్పించింది.

కడక్‌నాథ్ కోళ్లు ఆరోగ్యానికి మేలు

కడక్‌నాథ్ కోళ్లు పెంపకం ద్వారా డ్వాక్రా మహిళలు ఆర్థికంగా లాభాలు ఆర్జిస్తున్నారు. ఒక్కొక్క యూనిట్ ధర రూ.4750లు చెల్లించి 12 కోళ్లు తీసుకున్నారు. నలుపు రంగులో ప్రత్యేక ఆకర్షణగా ఉండే ఈ కోళ్లు అన్ని వాతావరణంలో సులువుగా పెరుగుతాయి. నాటు కోళ్లు పెరిగే వాతావరణంలో ఇవి పెరుగుతాయి. వీటి మాంసం ఆరోగ్యానికి ఎంతో మేలు చెబుతున్నారు. గుడ్లు బలవర్ధకమైన ఆహారం. అధిక పోషక విలువలు ఉంటాయి. వీటి ఈకలతో రంగురంగుల బొమ్మలు తయారు చేసుకోవచ్చు. దీంతో ఈ కోళ్ల పెంపకంపై డ్వాక్రా మహిళలు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు.


పాలకొల్లు మండలంలో లబ్ధిదారులకు పొందిన కడక్‌నాథ్ కోళ్లు

నియోజకవర్గంలో మంజూరు చేసిన యూనిట్లు

మండలం	కడక్‌నాథ్ కోళ్లు	పొట్టేళ్లు
పాలకొల్లు	200	06
యలమంచిలి	200	11
పోడూరు	---	04

కడక్‌నాథ్ కోళ్లు పెరట్లో పెంచుకోవడానికి అనువు



కడక్‌నాథ్ కోళ్లు పెరట్లో పెంచుకోవడానికి అనువుగా ఉన్నాయి. నాటు కోళ్లు మాదిరిగానే ఇవి కూడా పెరుగుతున్నాయి. ఈ ఏడాది జనవరిలో 5 నెలల వయస్సు గల కోడి పిల్లలు ఇచ్చారు. ప్రస్తుతం ఇవి గుడ్లు పెడుతున్నాయి.

– బండి నాగలక్ష్మి, పెదమామిడిపల్లి

రెండు యూనిట్లు తీసుకున్నా



మా కుటుంబంలో ఇద్దరు కలిసి పొట్టేళ్ల పెంపకానికి ఉన్నతి పథకంలో రుణం పొందాం. రెండు యూనిట్లుకి గానూ 11 పొట్టేళ్లు వచ్చాయి. మూడు నెలలైంది. వచ్చే ఏడాది జనవరి, ఫిబ్రవరి మాసాలకు వీటి ఫల సాయం వస్తుంది. ఇన్సూరెన్స్ సౌకర్యం కూడా ప్రభుత్వం కల్పించింది. దీంతో ధైర్యంగా వీటిని పెంచుతున్నాం. గ్రామంలో ఉన్న పశు సహాయకుడు సలహాలు తీసుకుంటున్నాం.

– బొండాడ లక్ష్మి, కొత్తపేట